సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం । 23 । జూలై । 2024



అనాథ మహిళకు అంత్యక్రియలు

ఎక్కడో పుట్టి..ఎక్కడెక్కడో పెరిగి..
కొద్ది రోజులుగా చీపురుపల్లి పట్టణంలో రోడ్ల పక్కనే ఉంటున్న ఓ మహిళ అకస్మాత్తుగా మరణించింది.

- 8లో



కానరాని ఈ-క్రాప్ నమోదు

గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదోనన్న బెంగ రైతన్నలను వెంటాడుతోంది. - 8లో

చెరకు తోటలో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ పంట పొలాల్లో ఉన్న చెరకు తోటలో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలలోనే కాకుండా చెరకుతోటలో కూడా ఏనుగులు సంచరించి తోటను పూర్తిగా ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఉబాలు జరుగుతుండడంతో వరినారు ధ్వంసం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖాధికారులను రైతులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: జిల్లాకేంద్రం పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ఆర్.వహీదా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో 120 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, 10వ తరగతి పాసై, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని ఆమె పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో టెలికాలర్స్‌గా 20 మంది మహిళలకు అవకాశం ఉందని స్పష్టం చేశారు.

ఐటీడీఏ పీవోకు వీడ్కోలు



ఐటీడీఏ పీవోను సన్మానిస్తున్న సిబ్బంది

సీతంపేట: బదిలీపై తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెళ్తున్న సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం బన్సల్‌కు సోమవారం ఆయన చాంబర్‌లో అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. వివిధ శాఖల అధికారులు ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, పీహెచ్‌వో గణేష్, డీడీ అన్నదొర, ఏఎంవో కోటిబాబు, పీవోసీసీ సతీష్, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

విరబూసిన రాఖీ పుష్పాలు



విరబూసిన రాఖీ పుష్పాలు

పాలకొండ రూరల్: అన్నా చెల్లెళ్ల అనురాగానికి, అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండగ మరికొద్ది రోజుల్లో రానుంది. ఈ నేపథ్యంలో పాలకొండ పట్టణంలోని బుట్టిమఠం సమీపంలో ఉన్న అర్చకుడు గాసీదాసు గృహంలో విరిసిన రాఖీ పుష్పాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ పూలతో ప్రస్తుతం బుట్టిమఠం ఆలయంలో కొలువైన భీమలింగేశ్వరుని అలంకరిస్తున్నట్లు అర్చకుడు, అక్కడి వారు పేర్కొంటున్నారు.

కమాండెంట్‌గా మల్లికా గార్గ్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమాండెంట్ మల్లికా గార్గ్

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్‌గా మల్లికా గార్గ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్‌కు విచ్చేసిన నూతన కమాండెంట్ మల్లికా గార్గ్‌కు అడిషనల్ కమాండెంట్ శామ్యూల్ జాన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బెటాలియన్ కమాండెంట్ కార్యాలయం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఆమె స్వీకరించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది నూతన కమాండెంట్ మల్లికా గార్గ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రామతీర్థంలో ఆక్రమణలపై సర్వే

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆక్రమణల వ్యవహారంపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఆలయానికి వెళ్లే మార్గంలో పలువురు దేవస్థాన భూములను ఆక్రమించి శాశ్వత షెడ్లు నిర్మించారు. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఉత్సవాల సమయంలో స్వామివారి వాహనాల సేవను జరిపించేందుకు తీవ్ర అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీనిపై ఈ నెల 14న 'రామా కనవేమిరా' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు స్పందించారు. రామతీర్థంలో సర్వే నిర్వహించాలని తహసీల్దార్ ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు. దీంతో మండల సర్వేయర్ దివ్య మానస ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం సర్వే జరిపారు. షాపులతో పాటు కొన్ని ఇళ్లు కూడా దేవస్థాన భూముల్లో ఉన్నట్టు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో దేవస్థాన భూమి 3.30 ఎకరాలు ఉన్నట్టు సర్వేలో స్పష్టమైందన్నారు. తుది నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్...

అధ్యక్షా.. ఇదే మా.. అభివృద్ధి ఆకాంక్ష

భోగాపురం విమానాశ్రయం, 'తోటపల్లి' మిగులు పనులు, సాలూరులో గిరిజన వర్సిటీ, కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరంలో మెడికల్ కళాశాల, రామతీర్థ సాగర్ వంటి పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. కోట్లాది రూపాయలతో పనులను ఓ కొలిక్కితెచ్చింది. వీటిలో కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న శాసన సభ సమావేశాల్లో వీటిని ప్రస్తావించి నిధులు రాబట్టాలని, పనులు పూర్తికి చిత్తశుద్ధితో కృషిచేయాలని ఉమ్మడి విజయనగరం జిల్లా వాసులు ఎమ్మెల్యేలను కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆకాంక్షిస్తున్నారు. ఆశగా ఎదురుచూస్తున్నారు.



- ఎన్నికల్లో పలు హామీలిచ్చిన టీడీపీ నాయకులు
- హామీల సాకారానికి వారి సంకల్ప శుద్ధిపైనే సందేహాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు
- భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు 34 శాతం పూర్తి
- గిరిజనుల చెంతనే విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాల
- విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం
- ప్రభుత్వం మారినా 'అభివృద్ధి' కొనసాగాలనే ప్రజల ఆకాంక్ష
- పరిపాలన కన్నా ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలకే టీడీపీ ప్రభుత్వం సరి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం! వారి ఓట్లతో అధికార పీఠమెక్కిన నాయకులు ప్రజాసేవకే అంకితం కావాలి. భారత రాజ్యాంగం ఆశించిందీ, ప్రజలు కోరుకుంటున్నదీ అదే! కానీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి అధికార దండం అందుకుని 45 రోజులు కూడా కాలేదు కానీ టీడీపీ ప్రభుత్వంలో పరిపాలన కన్నా ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలు, దాడులే ఎక్కువగా జరుగుతున్నాయి. కొత్తగా చేపడుతున్న అభివృద్ధి పనులేవీ లేకున్నా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని శాశ్వత అభివృద్ధి పనుల తాలూకా శిలాఫలకాలనూ ధ్వంసం చేస్తున్నారు. చివరకు అనేక అద్వితీయ సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలనే ఎంతో మెరుగుపర్చిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ నాయకులపై ప్రజలకు సందేహాలు కలుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతారా? మళ్లీ ఎగవేస్తారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఆయా హామీల సాధనకే కాదు స్థానిక ప్రాంతాల్లో సమస్యలపైనా ప్రజల గుండెచప్పుడును టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో వినిపించే విధానంపైనా వారి పనితీరు ఆధారపడి ఉంటుంది.

• కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం...

రాష్ట్ర విభజన చట్టం-2014 ప్రకారం రాష్ట్రానికి దక్కిన 13 ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఒకటి. చట్టం ప్రకారం దీన్ని గిరిజన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలి. కానీ 2014-19 కాలంలో నాటి టీడీపీ ప్రభుత్వం దీన్ని విశాఖ నగరానికి దగ్గరగా, కొత్తవలస మండలంలో ఏర్పాటు చేయాలనుకుంది. ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తప్ప దీనివల్ల గిరిజనులకు ఏమాత్రం ఉపయోగం ఉండదనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిబంధనల ప్రకారం గిరిజనుల చెంతనే ఏర్పాటు చేసింది. నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చొరవతో సాలూరు నియోజకవర్గంలో 526 ఎకరాల భూమిని కేటాయించింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి గత ఏడాది 25వ తేదీన నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.
మౌలిక వసతుల అభివృద్ధికీ నిధులు కేటాయించారు. ఇప్పుడు ఆ యూనివర్సిటీని మళ్లీ కొత్తవలస మండలానికి తీసుకెళ్లిపోతామని టీడీపీ నాయకులు చెబుతుండటంతో నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల భోగాపురం విమానాశ్రయ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కలిసిన సందర్భంగా గట్టి హామీ లభించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. దీన్ని తమ ప్రాంతానికి ఒక గుర్తింపుగా, తమ పిల్లల విద్యాభివృద్ధికి, వికాసానికి ఉపయోగపడేలా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ప్రస్తుతం ఉన్నచోటనే కొనసాగించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

• వైద్యవిద్యపై శ్రద్ధ చూపాల్సిందే..



2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి పునాదిరాయి పడింది. దీనికి శంకుస్థాపన చేసిన నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డే నిర్మాణ పనులనూ రూ.500 కోట్లతో పూర్తి చేయించారు. 150 ఎంబీబీఎస్ సీట్లతో మొదటి ఏడాది తరగతులనూ ఆయనే ప్రారంభించారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలోనున్న ఈ కళాశాలకు సంబంధించి రెండో దశ నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరుచేస్తే అవన్నీ కొలిక్కి వస్తాయి. ద్వితీయ సంవత్సర ఎంబీబీఎస్ తరగతి గదులు, హాస్టల్ భవనాలను సత్వరమే అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీదే ఉంది.



తుది దశకు చేరుకున్న గిరిజన ఇంజనీరింగ్ కళాశాల

• గిరిజన కళాశాల ప్రభవించేలా...

గిరిజన కుటుంబాల్లోని ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలన్న సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కురుపాం నియోజకవర్గంలోని టేఖరఖండి వద్ద గిరిజన ఇంజనీరింగ్ కళాశాలను తలపెట్టింది. దాదాపు 105 ఎకరాల విస్తీర్ణంలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టింది. సుమారు 80 శాతం పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఆ మిగులు పనులనూ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలని మన్యం జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.



పారిశ్రామిక అభివృద్ధికి దిక్సూచి బొబ్బిలిలోని గ్రోత్ సెంటర్

• తోటపల్లి ప్రాజెక్టు సార్థకమవ్వాలి

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో రైతుల సంక్షేమమే లక్ష్యంగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా తాను తలపెట్టిన జలయజ్ఞంలో భాగంగా నాగావళి నదిపై రూ.450.23 కోట్లతో తోటపల్లి ప్రాజెక్టును తలపెట్టారు. పాత ఆయకట్టు 64వేల ఎకరాలతో పాటు అదనంగా 1.20 లక్షల ఎకరాలకు, గజపతినగరం బ్రాంచ్ కెనాల్ ద్వారా 15 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనేదీ లక్ష్యం. ఆయన హయాంలోనే 80 శాతం నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. ప్రాజెక్టు పాత కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు, కుడి ప్రధాన కాలువ నిర్మాణానికి, భూసేకరణకు, మిగులు పనులను పూర్తి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.655 కోట్లు కేటాయించింది. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



• 'మానాపురం' ఆర్‌వోబీ



విశాఖపట్నం-రాయ్‌పూర్ జాతీయ రహదారిపై ప్రయాణించేవారికి గజపతినగరం నియోజకవర్గం పెదమానాపురం వద్దనున్న రైల్వే గేట్ ఓ పెద్ద సమస్య. ఒకసారి గేట్ పడిందంటే ఒక్కోసారి అరగంట వరకూ తీయని పరిస్థితి. ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్న ఈ సమస్యకు పరిష్కారంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య చొరవతో ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన రహదారి కూడా ప్రస్తుతం గోతులమయమైంది. ఆర్‌వోబీ నిర్మాణ పనులను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

• 'భీమసింగి' కోలుకుంటుందా?

చెరకు రైతులకు న్యాయం చేస్తామని కూటమి నాయకులు 2024 ఎన్నికల ప్రచారంలో, అంతకుముందు శృంగవరపుకోట పర్యటనల్లో చంద్రబాబు, లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ ప్రకారం గజపతినగరం నియోజకవర్గంలోని శ్రీవిజయరామ గజపతి సహకార చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలని స్థానిక రైతులు డిమాండు చేస్తున్నారు. వాస్తవానికి తొలుత 2003-04లో అప్పటి చంద్రబాబు పాలనలోనే ఈ ఫ్యాక్టరీ మూతపడింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి దీన్ని తెరిపించారు. తర్వాత మళ్లీ టీడీపీ ప్రభుత్వ కాలంలో నష్టాల్లోకి వెళ్లింది. తర్వాత మూతవేసేశారు.

• 'ఫెర్రో' పరిశ్రమలకు పరిస్థితేమిటి?

చీపురుపల్లి నియోజకవర్గంలో ఆరు ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమల్లో ప్రధానంగా విద్యుత్తు ఆధారంగా నడిచే మూడు పరిశ్రమలు మూతపడ్డాయి. విద్యుత్తు చార్జీలు తగ్గిస్తే అవి తిరిగి తెరుచుకునే అవకాశం ఉంది. వీటిని తెరిపిస్తానని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ఎంతవరకూ నెరవేరుతుందోనని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

• భోగాపురం విమానాశ్రయం...

ఉత్తరాంధ్ర దిశా దశ మార్చేయగల సత్తా ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను భోగాపురం మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. గత 15 నెలల కాలంలో 34 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భూసేకరణ సమస్యలను పరిష్కరించడమే గాక నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం తదితర ప్రక్రియలన్నీ అప్పుడే పరిష్కారమయ్యాయి. ఇప్పుడు 2026 నాటికల్లా నిర్మాణ పనులను పూర్తి చేయించడమే టీడీపీ ప్రభుత్వం ముందు ఉన్న ఏకైక ప్రక్రియ.



సగానికి పైగా నిర్మాణ పనులు పూర్తి అయిన రన్ వే

• సాగు, తాగునీటి ఆదరువు 'రామతీర్థసాగర్'



విజయనగరం జిల్లాకేంద్రంలోని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సరఫరాకు, నెల్లిమర్ల నియోజకవర్గంలో సాగునీటి పారుదలకు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నీటి అవసరాలకు ఉద్దేశించిన తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని అంచనా వ్యయాన్ని రూ.739.9 కోట్లకు పెంచి నిర్మాణ పనులను పునఃప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 52 శాతం పనులు పూర్తి అయ్యాయి.

రెన్యువల్‌కు సీఆర్‌టీల డిమాండ్

- కలెక్టరేట్ గేటువద్ద నిరసన

పార్వతీపురం: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలను తక్షణమే రెన్యువల్ చేయాలని కోరుతూ సీఆర్‌టీల సంఘం అధ్యక్షుడు ఆరిక వెంకటరావు ఆధ్వర్యంలో పలువురు సీఆర్‌టీలు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద సోమవారం నిరసన తెలిపారు. తొలుత సాయంత్రం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంవద్ద నిరసన, ఆందోళన చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చి రాత్రిని సైతం లెక్కచేయకుండా తమ పరిష్కారం కోసం బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు సీఆర్‌టీలను రెన్యువల్ చేసేవారని, ఈ ఏడాది కొంతమంది సీఆర్‌టీలకు కౌన్సెలింగ్ నిర్వహించి, మరికొంతమందికి నిర్వహించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ చేసిన సీఆర్‌టీలకు కూడా జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వలేదని వాపోయారు. ఇంకా 45 మంది సీఆర్‌టీలకు కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో వసతి గృహాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని ఐటీడీఏ డీడీ రుక్మాంగదయ్య వైఖరి కారణంగా సక్రమంగా కౌన్సెలింగ్ జరగలేదని ఆరోపించారు. మిగిలి ఉన్న సీఆర్‌టీలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కలెక్టర్ వచ్చి తమ సమస్య పరిష్కారానికి భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ఇదిలా ఉండగా ప్రస్తుత ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు బదిలీ కావడంతో, కొత్తగా వచ్చిన పీఓకు ఈ సమస్య కొత్తగా ఉంటుందని, దానివల్ల సీఆర్‌టీల రెన్యువల్ మరింత జాప్యం జరిగే అవకాశం ఉంటుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నిరసనకు యూటీఎఫ్ నాయకులు కూడా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, సాలూరు, మక్కువ మండలాలకు చెందిన సీఆర్‌టీలు త్రినాథరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రధాన గేటువద్ద బైఠాయించిన సీఆర్‌టీలు



ఐటీడీఏ వద్ద నిరసన చేస్తున్న సీఆర్‌టీలు

పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్
- జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ 31వ ప్లీనరీ

పార్వతీపురంటౌన్: జిల్లాలో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లాకేంద్రం పార్వతీపురంలోని గిరిజన సామాజిక భవనంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 31వ ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్య పాలన విధానాల వల్ల విద్యారంగం గాడి తప్పుతోందని, ప్రాథమిక విద్య తునాతునకలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటికీ నీట్ స్కామ్‌ను బట్టబయలు చేయకపోవడంతో ప్రభుత్వ పాత్ర క్షుణ్ణంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పందించకపోవడం అన్యాయమని వాపోయారు. విద్యారంగంలో జరుగుతున్న ప్రతి ఒక్క మోసాన్ని, ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వాలి. మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలి. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని రద్దు చేయాలి. 100% సీట్లు కన్వీనర్ కోటలోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా బకాయి ఉన్న మెనూ చార్జీలు, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన తక్షణమే విడుదల చేయాలని కోరారు. పార్వతీపురంలో మహిళా జూనియర్ కళాశాల, పాలకొండ మండల కేంద్రంలో పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, పాచిపెంట సీతానగరం, కొమరాడ మండల కేంద్రాల్లో డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీరఘట్టం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్

17 మందితో నూతన జిల్లా కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా కె.రాజు కార్యదర్శిగా డి.పండు, కోశాధికారిగా అఖిల్, గర్ల్స్ కన్వీనర్‌గా రోజా, ఉపాధ్యక్షులుగా గంగారాం, సహాయ కార్యదర్శిగా పి.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులుగా పదకొండు మందిని ప్లీనరీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



గాయపడిన ఆటో డ్రైవర్

బొండపల్లి: మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి26పై సోమవారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న పుసపాటిరేగ చెందిన ఆటోను అదే మార్గంలో వెళ్తున్న కాంక్రీట్ మిక్సింగ్ లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ కె.సూరికి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతురాలు వరహాలమ్మ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన కోడూరు వరహాలమ్మ (74) మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరహాలమ్మకు ఇద్దరు కొడుకులు, కూతుళ్లు ఉన్నారని, ఏడాదిన్నరగా ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో బాగోగులు చూసుకునే వారు కరువయ్యారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం గడ్డి మందు తాగేసినట్లు చెప్పారు. తొలుత వీరఘట్టం పీహెచ్‌సీ, పాలకొండ ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఆమె కుమారుడు ధనుంజయనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్సు, లారీ ఢీ: పలువురికి గాయాలు



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కొమరాడ: కూనేరు నుంచి పార్వతీపురం వెళ్లున్న ఆర్టీసీ బస్సును పార్వతీపురం నుంచి రాయిగడ వెళ్తున్న లారీ సోమవారం గుమడ సమీపంలో ఢీకొంది. దీంతో జరిగిన ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై నీలకంఠ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పరామర్శ కోసం చోళ్లపదం వెళ్లి బస్సులో తిరిగి వస్తుండగా లారీ ఢీకట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరిశర్ల అప్పలనాయుడు తలకు, మరిశర్ల సంజీవ కుమార్ కుడిచేతికి గాయాలు కాగా మరికొందరికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే క్షతగ్రాతులను పార్వతీపురం జిల్లా అస్పత్రికి తరలించగా చిక్సిత అందిస్తున్నారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆధార్' కోసం ఆశ్రయించవద్దు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఆధార్ కార్డులో సవరణలు వయస్సు మార్పుచేర్పులు చేస్తామంటూ ప్రజలను మధ్యపెట్టేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆధార్‌లో మార్పులు, సవరణలు చేస్తామంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తమ దృష్టికి వచ్చిందని అటువంటి వాటిపై నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన కేంద్రాలు మినహా మరెక్కడా ఆధార్‌లో మార్పులు, సవరణలు చేసేందుకు అవకాశం లేదని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని, తప్పుడు ప్రకటనలకు మోసపోవద్దని కోరారు. అటువంటి వారిని ఆశ్రయించవద్దని సూచించారు. జిల్లాలో తాగునీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేయాలని తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు. వాటి నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నదీ లేనిదీ అదే విధంగా వాటిలో సరైన ప్రమాణాలు పాటిస్తున్నదీ లేనిదీ తనిఖీ చేసి నివేదించాలని ఆదేశించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

గడువులోగా వినతుల పరిష్కారం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: అధికారులు ఏ రోజు వినతులు ఆ రోజే చూడాలని నాట్ వ్యూ ఉండకూడదని అలాగే వచ్చిన వాటిని గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 149 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అధికారులు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పంపాలని ఆన్‌లైన్‌లో ఏ స్టేజ్‌లోనూ పెండింగ్ కనపడకూడదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత వినతులు స్వీకరించారు.

ఎస్పీకి 29 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి 29 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్బీ సీఐలు కేకేవీ .విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి: డీఆర్‌ఓ

పార్వతీపురం: ప్రభుత్వ భూములు, తోటపల్లి నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో అక్రమణలను తక్షణమే తొలగించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవ నాయుడు మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ కేశవనాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన 69 అర్జీలపై సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు అందినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని,



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కార వెవేదిక వెలవెల

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక వెలవెల బోయింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినతులు ఇవ్వడానికి ఎవరూ రాకపోవడంతో కార్యక్రమంలో అధికారులు మాత్రమే మిగిలారు. 12.30గంటల తర్వాత వివిధ సమస్యలపై 35 వరకు వినతులు వచ్చాయి. గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ సింహాచలం వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నారాయుడు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ కేశవ నాయుడు



పార్వతీపురం టౌన్: బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి



సీతంపేట: వెలవెలబోతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్
- సాలూరులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- కలెక్టర్‌కు స్వీకరించిన 287 వినతులు



వినతులు తీసుకుంటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాలూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సాలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యల పట్ల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అలాగే అధికారులు ప్రతి మంగళవారం, శుక్రవారం క్షేత్రస్థాయి సందర్శన చేయాలని కోరారు. భారీ వర్షాలకు రోడ్లు మరమ్మతులకు గురై ఉంటాయని వాటిని పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ అధికారులకు కోరారు. అలాగే వార్తాపత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు 100 రోజుల కార్యాచరణ రూపొందించాలని, ప్రతినెల రెండు బ్లడ్ క్యాంపులు న్విహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వచ్చిన 287 వినతులను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, సంయుక్తకలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఆర్‌డీఓ కె.హేమలత స్వీకరించారు. ముఖ్యంగా భూసమస్యలపై అర్జీలు అధికంగా వచ్చాయి.

ప్రొటోకాల్ పాటించాలి

ప్రొటోకాల్ పాటించాలంటూ వైఎస్సార్‌సీపీ కొట్టు పరువు సర్పంచ్ కొండతామర నరసింహులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ప్రజాప్రతినిధుల విషయంలో మండల అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు,పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ



లబ్ధిదారులతో జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (విశాఖపట్నం) ఆర్థిక సౌజన్యంతో జిల్లాలోని విభిన్నప్రతిభావంతులకు వివిధ సహాయ ఉపకరణాలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ 26 మంది దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మూడుచక్రాల వాహనాలను అందజేశారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు గత ఏడాది నవంబర్ 18న స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన శిబిరంలో లబ్ధిదారుల జాబితా ఎంపికచేశామని విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా ఎ.డి జీవీబీ జగదీష్ తెలియజేశారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు కె.దిలీప్‌కుమార్, సత్యనారాయణ, ఆలిమ్ కో ప్రతినిధులు డి.శివకుమార్, జనార్దన సాహు తదితరులు పాల్గొన్నారు.

ట్రీమాన్ సినిమా సందడి



మూవీ షూటింగ్ సందడి



చిత్రీకరణలో భాగం

పాచిపెంట: మండలంలోని పద్మాపురం సమీపంలో 'ట్రీమాన్' అనే సినిమా చిత్రీకరణ జరుగుతోంది. గిరిజన ఆచార సంప్రదాయాలు చూపించే విధంగా ఈ సినిమా రూపొందిస్తున్నట్లు డైరెక్టర్ రాజు తెలిపారు.కాగా సినిమా చిత్రీకరణ హడావుడితో పద్మాపురం పరిసర ప్రాంతాల గిరిజనులు, ప్రజలు షూటింగ్ స్థలానికి చేరుకున్నారు. చిత్రీకరణ తీరును చూస్తూ ఇంతవరకు సినిమాలు చూడడమే తప్ప, ఎలా తీస్తారో ఇప్పుడే చూస్తున్నామంటూ మాట్లాడుకున్నారు.

నిరుపేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

- జిల్లా బ్రాహ్మణ సంక్షేమసేవా సంఘం



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్

విజయనగరం టౌన్: నిరుపేద బ్రాహ్మణుల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషిచేస్తామని జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు టీవీ.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యాసపూర్ణిమనుపురస్కరించుకుని బ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేస్తున్న పలువురు వేదపండితులను సంఘం తరపున సత్కరించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. జిల్లాలోని నిరుపేద బ్రాహ్మణులకు అండగా సంఘం తరపున తామందరం ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం చిన్నారుల నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు వేదపండితులు, ప్రవచన కర్తల దంపతులను వస్త్రాలు, శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కట్టమూరి చంద్రశేఖర శర్మ, భమిడిపాటి రామ్‌కుమార్, కూరెళ్ల సరోజిని, సత్యనారాయణ, సరిపల్లి శ్రీనివాస్, రాపాక చంద్రశేఖర్, ఈశ్వర సోమయాజులు (రాంజీ), కందాల సాయిబాబా, యామిజాల, పప్పు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌ను పరిశీలించిన డీఈఓ



శిక్షా సప్తాహ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

సాలూరు: అన్ని పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని డీఈఓ పగడాలమ్మ పరిశీలించారు. సోమవారం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. స్థానిక వనరులతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో తయారు చేయించిన బోధనా అభ్యసనా సామగ్రిను సందర్శించారు. విద్యార్థులను ప్రోత్సహించి, లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్‌ఎం పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు

- మానవత్వం చాటుకున్న స్వచ్ఛంద సంస్థలు



అనాథ మహిళకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు

చీపురుపల్లి: ఎక్కడో పుట్టి..ఎక్కడెక్కడో పెరిగి..కొద్ది రోజులుగా చీపురుపల్లి పట్టణంలో రోడ్ల పక్కనే ఉంటున్న ఓ మహిళ అకస్మాత్తుగా మరణించింది. ఆమె కంటూ ఎవరూ లేకపోయినా.. అనాథగానే మరణించినప్పటికీ అంత్యక్రియలు మాత్రం అందరూ ఉన్నట్లు గానే సంప్రదాయ పద్ధతిలో జరిగాయి. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా చీపురుపల్లి పట్టణంలో అనాథగా తిరుగుతున్న ఓ మహిళ లావేరురోడ్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో గల బస్‌షెల్టర్‌లో సోమవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్, మానవీయత స్వచ్ఛంద సంస్థలకు సమాచారం అందించారు. దీంతో తక్షణమే స్పందించిన ఆ సంస్థల అధ్యక్షులు రెడ్డి రమణ, బీవీ.గోవిందరాజులుతో పాటు మానవతా వాదులు కోట్ల పైడిరాజు, తాడ్డి సీతాలక్ష్మి, కనకరత్నం అక్కడికి చేరుకుని మృతి చెందిన అనాథ మహిళను గుర్తించారు. దీంతో మార్చురీ వాహన నిర్వాహకుడు బత్తుల నారాయణను సహాయం కోరగా ఆయన ఉచితంగానే వాహనం తీసుకొచ్చాడు. అనంతరం వారంతా కలిసి మృతదేహానికి స్నానం చేయించి అప్పటికే కొనుగోలు చేసిన చీరలు, పూలదండలు మృతదేహంపై వేశారు. అక్కడి నుంచి వాహనంలో మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు జరిపించారు.

కానరాని ఈ-క్రాప్ నమోదు

- ప్రారంభం కాని కార్యక్రమం
- ఖరీఫ్ ప్రారంభమై నెలరోజులైనా కదలని యంత్రాంగం
- ప్రభుత్వం నుంచి రాని స్పష్టత



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది(ఫైల్)

పార్వతీపురం: గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడు మూతలాడుతుండడంతో సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. పార్వతీపరరం మన్యం జిల్లాలో గత ఏడాది 15 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 1.77 లక్షల ఎకరాలలో ఈ-క్రాప్ నమోదు చేశారు. అదే విధంగా రబీలో 45వేల ఎకరాలలో ఈ- క్రాప్ నమోదు చేశారు. ఖరీఫ్‌లో ఈ ఏడాది 1.75 ఎకరాల్లో పంట సాగు లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేయగా ఇంతవరకు 40 శాతం వరకు వరి ఉబాలు నిర్వహించారు. గింజ విత్తినప్పటి నుంచి కోత, అమ్మకం వరకు అండగా ఉండే ఈ-క్రాప్ విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అండగా ఉండేందుకు, అర్హులైన రైతులకు అన్ని విధాలా మేలు చేసేందుకు ఈ-క్రాప్ విధానం తోడ్పాటు అందించేది.

గత ప్రభుత్వంలో అమలైంది ఇలా..

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామ స్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్‌లో ప్రతిష్టాత్మకమైన ఈ-క్రాప్ విధానాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఆర్బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్బీకేలలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత ఉండేది. రెవెన్యూ వెబ్ ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ-క్రాప్ విధానం అమలులో ఉండడం వల్ల రైతు సాగు చేసే పంట వివరాలు వ్యవసాయ శాఖలో నమోదయ్యేవి. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్బీకేలలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌లలో నిక్షిప్తమయ్యేవి. సమయానికి ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించే అవకాశం ఉండేది. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతుల్లో సాగు పట్ల ధీమా కలిగించేది. పండితే పంట.. లేకుంటే బీమా వస్తుండడంతో రైతన్నలు సాగు చేయడానికి సన్నద్ధంగా ఉండేవారు. ఈ-క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలిగేది. రైతులు పండించిన ఉత్పత్తులను ఎప్పుడైనా తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించేది.

'అమలు చేయకపోతే అన్నదాతకు కష్టాలు

వరి సాగు చేపట్టే రైతులు, కౌలు రైతుల వివరాలు, సర్వే నంబర్ల వివరాలు వ్యవసాయశాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. పంట సాగు వివరాలు తెలియకపోవడంతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు ఆ రైతులకు అవసరమైన వ్యవసాయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆస్కారం లేకుండా పోతోంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ పొందే హక్కు రైతులు కోల్పోయే ప్రమాదముంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలను కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలు కోల్పోతారు. ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు కాకపోవడం వల్ల అనర్హులకు ప్రభుత్వ రాయితీలు దక్కే ప్రమాదముంది. పలు రకాల పంటలు సాగు చేసే రైతుల సమగ్ర వివరాలు గుర్తించే అవకాశం లేకుండా పోవడంతో అవినీతి జరిగే అవకాశం మెండుగా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తీవ్రంగా నష్టపోతాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-క్రాప్ చేయకపోతే పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని కొనసాగించి రైతులను ఆదుకోవాలి.

-ఎం.శ్రీనివాసరావు, రైతు, పెద్దూరు గ్రామం

పంట వేసిన తరువాతే ఈ-క్రాప్ నమోదు



రైతులు పొలంలో పంట వేసిన తరువాతే ఈ-క్రాప్‌ను నమోదు చేస్తాం. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఏ విధమైన ఆదేశాలు అందలేదు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం ప్రకారం ప్రతి రైతుకు మేలు చేసేలా వ్యవసాయాధికారులు, సిబ్బందితో కలిసి ఈ క్రాప్ నమోదు చేస్తాం.

-కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు పౌరవేదిక వినతి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న పౌరవేదిక ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాకేంద్రంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి(జీజీహెచ్)లో పనిచేస్తున్న జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ)ఆఫీస్ సబార్డినేట్ (ఓఎస్)ల 43 కుటుంబాలను మీ నిర్లక్ష్యంతో రోడ్డున పడేశారని, సంవత్సరం కాలంగా వారి చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వారికి ప్రతి నెలా ఎందుకు జీతాలు ఇవ్వలేదో అధికారులు వెంటనే తెలియచేయాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ జిల్లా ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెండ్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడిని నిలదీశారు. ఈ మేరకు సోమవారం ఆయన పౌర వేదిక ప్రతినిధుల బృందంతో కలిసి డాక్టర్ అప్పలనాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 జూలై నెలనుంచి 43 మంది నిర్విరామంగా జిల్లా కేంద్రాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తుంటే వారికి జీతాలు సమయానికి అందించాలనే ఆలోచన అధికారులకు లేకపోవడం విచిత్రంగా ఉందని, పని చేస్తున్న ఉద్యోగుల తల్లిదండ్రులు, పిల్లలు ఎలా జీవిస్తారని ఆవేదన వ్యక్తంచేశారు, వారి సమస్యలు చెప్పుకుం దామనుకుంటే అధికారులు కనీసం సమయం ఇవ్వకపోవడమే కాకుండా హేళనగా మాట్లాడుతూ వారి మనోభావాలు దెబ్బ తీస్తున్నారని,25 మందిలో 11 మంది మహిళలు ఉద్యోగం చేస్తున్నారని వారి ఆవేదన అర్థం చేసుకునే పరిస్థితిలో ఆసుపత్రి అధికారులు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.